1St Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 249 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 11 ఆగస్టు 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 249 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 11 August 2025 PAGES : 8 PRICE : 3/-

## ట్రంప్‌పై పరోక్ష వ్యాఖ్యలతో విరుచుకుపడిన రాజ్‌నాథ్ సింగ్



భారత్ ఎదుగుదలను ఓర్వలేక కుట్రలు చేస్తున్నారంటూ రాజ్ నాథ్ సింగ్ ఫైర్

భారత్ అభివృద్ధిని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శలు

భారత్ ఎదగకుండా ఏ శక్తీ అడ్డుకోలేదని స్పష్టీకరణ

2

## పవన్‌తో బలవంతంగా వాంగ్మూలం ఇప్పించారు.. వారిని వదిలే ప్రసక్తే లేదు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)

భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి తిరుపతిలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామ్ అన్నారు. తిరుపతి వాసులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఆదివారం తిరుపతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పట్టాభి మాట్లాడారు. "ఇటీవల దళిత యువకుడు -మిగతా 2లో

## ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక.. 'మేక్ ఇన్ ఇండియా': ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 10)

పాకిస్థాన్‌ను మట్టికరిపించిన 'ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక 'మేక్ ఇన్ ఇండియా', మన సాంకేతికత దాగి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరికొత్త భారత్‌ను ప్రపంచం మొదటిసారి చూసిందన్నారు. రూ.15,610 కోట్ల వ్యయంతో బెంగళూరులో మెట్రో మూడో ఫేజ్ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. నవ భారతానికి చిహ్నంగా బెంగళూరు ఎదుగుతోందన్నారు.

"ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం తొలిసారి సరికొత్త భారత్‌ను చూసింది. మన బలగాలు పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని.. కొన్ని గంటల్లోనే ఆ దేశాన్ని మోకరిల్లేలా చేశాయి. ఈ విజయానికి మన టెక్నాలజీ, రక్షణా రంగంలో 'మేక్ ఇన్ ఇండియా' శక్తి దోహదపడ్డాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. 2014కు ముందు కేవలం ఐదు నగరాలకే పరిమితమైన మెట్రో సేవలు.. నేడు 24 నగరాలకు విస్తరించాయన్నారు.

**కేంద్రం కంటే ఎక్కువ ఖర్చు: సిద్ధరామయ్య**

బెంగళూరు మెట్రో కోసం కేంద్రం కంటే రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేస్తోందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. బెంగళూరులో మెట్రో మూడో ఫేజ్ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఈమేరకు మాట్లాడారు. "ఒప్పందం ప్రకారం మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం, -మిగతా 2లో

## తాండవ ప్రాజెక్టు నీటిని సద్వినియోగం చేసుకోండి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని తాండవ ప్రాజెక్టు నీటిని ఆయకట్టు రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు సూచించారు. హోం మంత్రి అనితతో కలిసి ఆయన ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. అనంతరం జలహారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ఏడాది రూ.2.10 కోట్ల విపత్తు నివారణ నిధితో 18 అభివృద్ధి పనులు చేపట్టామని స్పీకర్ తెలిపారు. ఆయకట్టుకు 2 నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టును తెదేపా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు.

# అడవి తల్లి బాట గురించి గిరిజన ప్రాంత ప్రజలకు చెప్పండి

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)

గిరిజన ప్రాంతాల్లో 'అడవి తల్లి బాట' పేరిట చేపట్టిన నూతన రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పనులు పూర్తయితే 625 గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడుతుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రోడ్ల నిర్మాణంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, రెండు వారాలకోసారి శాఖాపరంగా సమీక్షించి నిర్మాణ పురోగతిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారి పనుల స్థితిగతులపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులతో పవన్ ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం జన్ మన్ పథకంతో పాటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి రూ.1005 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో -మిగతా 2లో

## ఆపరేషన్ సిందూర్‌తో భారత్ బద్దలు కొట్టిన అరుదైన రికార్డ్ ఇదే..



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 10)

పాకిస్థాన్‌పై భారత్.. క్రికెట్‌లోనే కాదు, యుద్ధంలోనూ రికార్డులను బద్దలు కొట్టింది. దీంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఆపరేషన్ సిందూర్‌తో ఓ సరికొత్త రికార్డు నెలకొల్పినట్లు వాయుసేన చీఫ్ ప్రకటించారు. తాము పాక్ గగనతలంలోని ఐదు ఫైటర్ జెట్‌లు, ఓ భారీ విమానాన్ని కూల్చేశామన్నారు. దీనిలో ఓ విమానాన్ని ఏకంగా 300 కిలోమీటర్ల అవతల నుంచే ధ్వంసం చేసినట్లు ప్రకటించారు. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా గతంలో ఎన్నడూ ఇంత దూరం నుంచి ఊపరితలంపై నుంచి గగనతల లక్ష్యాన్ని ఛేదించలేదు. అంతకు ముందు కూల్చిన లక్ష్యాల్లో 200 కిలోమీటర్ల దూరమే అత్యధికం. 2024 ఫిబ్రవరిలో రష్యాకు చెందిన ఏ-50 నిఘా విమానాన్ని ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థ 200 కిలోమీటర్ల దూరం నుంచి కూల్చేసింది. ఈ విషయాన్ని బీబీసీ కథనంలో పేర్కొంది. రొస్టోవ్ ఆన్ డాన్, క్రస్నడోర్ మధ్య ఈ దాడి జరిగింది. ఆపరేషన్ సిందూర్‌లో 300 కిలోమీటర్ల లక్ష్యం దీనిని బద్దలు కొట్టినట్లైంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ సు-27 యుద్ధ విమానాన్ని రష్యాకు చెందిన ఎస్-400 గగనతల వ్యవస్థ 150 కిలోమీటర్ల దూరంలో పేల్చేసింది. -మిగతా 2లో

## వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది

జడ్పీటీసీ ఉప ఎన్నికలపై జగన్ స్పందన

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు

సీఎం చంద్రబాబుపై జగన్ తీవ్ర ఆరోపణలు

అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికలను హైజాక్ చేస్తున్నారని విమర్శ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్య విరుద్ధంగా, అరాచకంగా వ్యవహరిస్తున్నారని, కుట్రలు, దాడులు, అబద్ధాలతో అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల నేపథ్యంలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, ఎన్నికలను హైజాక్ చేసేందుకు చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ గూండాలు, కొందరు అధికారులు, పోలీసులు కలిసి ఈ కుట్రను అమలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు కుట్రపూరిత ప్రణాళికలను అమలు చేస్తున్నారని మండపడ్డారు. -మిగతా 2లో

## 'సత్వర న్యాయం'.. దేశంలోనే ఏపీని ప్రథమ స్థానంలో నిలబెడతా

## హోం మంత్రి అనిత

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)

బాధితులకు సత్వర న్యాయం అందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆధునిక సాంకేతిక పోలీసింగ్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించి, నిత్యం నిర్దేశిస్తూనే ఉంటారని తెలిపారు. ఏడాది కాలంలో డ్రోన్ పోలీసింగ్, మహిళల భద్రత కోసం శక్తి యాప్, రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతమైన సీసీటీవీ కవరేజ్ వంటి ఆవిష్కరణలతో అద్భుతమైన ఫలితాలొచ్చాయని చెప్పారు. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రాధాన్యత ప్రాతిపదికన దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. కేవలం రెండు నుంచి ఆరు నెలల రికార్డు సమయంలోనే దోషులుగా తేల్చి.. న్యాయం వేగంగా అందేలా చూస్తున్నామన్నారు. ప్రజా నమ్మకం, భద్రత, సంక్షేమాన్ని పెంపొందించే ఏకైక లక్ష్యంతో విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్ పని చేస్తోందని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.



## ఆనాడు సాయం.. నేడు ప్రయోగం.. అమెరికా శాటిలైట్‌తో ఇస్రో సరికొత్త చరిత్ర



(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఆగస్టు 10)

ఒకప్పుడు చిన్న రాకెట్ కోసం అగ్రరాజ్యం అమెరికా వైపు చూసిన భారత్, ఇప్పుడు అదే అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహాన్ని తన సొంత గడ్డపై నుంచి నింగిలోకి పంపే స్థాయికి ఎదిగింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) త్వరలో ఈ చరిత్రాత్మక ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఇటీవల నాసా-ఇస్రో సంయుక్త 'నైసర్' మిషన్‌ను విజయవంతం చేసిన ఉత్సాహంతో, మరో కీలక ఘట్టానికి నాంది పలుకుతోంది.

చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. రాబోయే రెండు నెలల్లో అమెరికాకు చెందిన 6,500 కిలోల బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్‌ను భారత రాకెట్ ద్వారా ప్రయోగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గతాన్ని గుర్తుచేసుకుంటూ, భారత అంతరిక్ష ప్రస్థానంలోని అద్భుతమైన పురోగతిని వివరించారు.

"ఆరు దశాబ్దాల క్రితం అమెరికా నుంచి మనం ఓ చిన్న రాకెట్‌ను అందుకున్నాం. కానీ ఇప్పుడు, అదే అమెరికా తయారు చేసిన భారీ ఉపగ్రహాన్ని మన రాకెట్ తో, మన భూభాగం నుంచి ప్రయోగించబోతున్నాం. ఇది ఎంతటి అద్భుతమైన ప్రగతి?" అని ఆయన వ్యాఖ్యానించారు.

1963లో ఇస్రో ప్రస్థానం ప్రారంభమైనప్పుడు, అభివృద్ధి చెందిన దేశాల కన్నా భారత్ సాంకేతికంగా వెనుకబడి ఉండేది. ఆ ఏడాది నవంబర్ 21న అమెరికా అందించిన చిన్న -మిగతా 2లో

## ట్రంప్‌పై పరోక్ష వ్యాఖ్యలతో విరుచుకుపడిన రాజ్‌నాథ్ సింగ్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 10)

భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత వస్తువులపై 25 శాతం సుంకం విధించిన నేపథ్యంలో, కొన్ని దేశాలు భారత ఆర్థిక పురోగతిని అసూయతో చూస్తూ, దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. "కొందరు 'బాస్'లు భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న వేగాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మనమే అందరికీ బాస్ అయితే, భారత్ ఇంత వేగంగా ఎలా అభివృద్ధి చెందుతోందని వారు అనుకుంటున్నారు?" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని రైసెన్ జిల్లా, ఉమరియా గ్రామంలో బీఈఎంఎల్ కొత్త యూనిట్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

"కొన్ని దేశాలు భారతీయ ఉత్పత్తులను ఇతర దేశాల ఉత్పత్తుల కంటే ఖరీదైనవిగా చేయడానికి ప్రయత్నిస్తున్నాయి, తద్వారా ధరలు పెరిగితే ప్రపంచం వాటిని కొనడం మానేస్తుంది" అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. అయినప్పటికీ, "భారత్ ఇంత వేగంగా ముందుకు సాగుతోంది, ఇప్పుడు ఏ శక్తీ భారత్‌ను ప్రపంచంలో ఒక గొప్ప శక్తిగా ఎదగకుండా ఆపలేదు" అని ఆయన ధీమాగా చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ రంగంలో అద్భుతమైన మార్పు వచ్చిందన్నారు. "ఒకప్పుడు ఆయుధాల నుంచి యుద్ధ విమానాల వరకు దిగుమతి చేసుకునేవాళ్ళం. కానీ ఇప్పుడు మనం వాటిని మన దేశంలోనే తయారు చేయడమే కాకుండా, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. ఒకప్పుడు అతి తక్కువగా ఉన్న మన రక్షణ ఎగుమతులు ఇప్పుడు ఏకంగా రూ. 24,000 కోట్లకు పెరిగాయి. ఇది మన పెరుగుతున్న సామర్థ్యానికి నిదర్శనం" అని ఆయన వివరించారు. దేశ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, రక్షణ రంగం దేశ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

## పవన్‌తో బలవంతంగా వాంగ్మూలం ఇప్పించారు.. వారిని వదిలే ప్రసక్తే లేదు

పవన్‌ను భూమన అభినయ్‌రెడ్డి ముఖ్య అనుచరులు అనిల్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేశారు. ఘటనకు సంబంధించిన వీడియోలు బయటకు రావడంతో పవన్‌ను బెదిరించి.. తన సోదరుడే కొట్టాడని బలవంతంగా వాంగ్మూలం ఇప్పించారు. వైకాపా నేతలు.. మనిషి రూపంలో ఉన్న మానవమృగాలు అనేందుకు ఈ ఘటనే ఉదాహరణ.

సీఎం చంద్రబాబు మంత్రి లోకేశ్ ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి బాధితుడిని కిడ్నాప్ చెర నుంచి తప్పించారు. ప్రధాన నిందితులను ఇప్పటికే అరెస్టు చేశాం. దీని వెనుక ఉన్న కరుణాకర్‌రెడ్డి, అభినయ్ రెడ్డిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కరుణాకర్‌రెడ్డి చేసిన భూకబ్జాలు, అవినీతికి సాక్ష్యాలున్నాయి. స్వర్ణముఖి నది ప్రాంతంలో 9 ఎకరాల భూమి కబ్జా చేశారు. నదీ గర్భాన్ని కూడా మింగిన భూరాక్షసుడివి నువ్వు. ఒక్క జిరాక్స్ మిషన్ పెట్టుకున్న భూమన ఈరోజు రూ.వేలకోట్లకు అధిపతి ఎలా అయ్యారు. తితిదే ఛైర్మన్, తుడా ఛైర్మన్‌గా ఉన్న కాలంలో 21 ఆస్తులు మీ కుటుంబ సభ్యుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. తితిదే ఛైర్మన్, తుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడే ఆస్తులు కొనడానికి డబ్బులుంటాయా?" అని పట్టాభి ప్రశ్నించారు.

**మొదటిపేజీ తరువాయి**

## అడవి తల్లి బాట గురించి గిరిజన ప్రాంత ప్రజలకు చెప్పండి

రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు.

'అడవి తల్లి బాట' పేరుతో రెండు దశల్లో చేపట్టిన పనుల్లో స్వాతంత్ర్యం వచ్చాక ఇప్పటి వరకు రహదారి సౌకర్యం లేని గిరిజన ఆవాసాలను సైతం అనుసంధానించేలా రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పవన్‌కు అధికారులు తెలిపారు. ఈ పనుల పురోగతిని వివరిస్తూ పనులు వేగంగా చేయడానికి ఎదురవుతున్న సవాళ్లను, అవరోధాలను వివరించారు. కొండలపై ఉన్న ఆవాసాలను అనుసంధానిస్తూ కొత్త రోడ్డు రూపకల్పన చేసేందుకు బండరాళ్లను బద్దలు కొడుతూ ముందుకు వెళ్లేందుకు అధిక సమయం పడుతోందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తూ ఉండటంతో పనుల వేగం తగ్గిందన్నారు. 128 రోడ్లు.. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉండడం వల్ల అటవీశాఖ అనుమతులు కోరగా ఇప్పటికే 98 రోడ్లకు వచ్చాయని వెల్లడించారు. ఇప్పటి వరకు 186 పనులు చేపట్టగా, మరో 20 పనులు టెండర్ దశలో ఉన్నట్టు అధికారులు వివరించారు. గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన ఈ పనుల గురించి స్థానికులకు కూడా తెలియజేయడం ఎంతో అవసరమని పవన్ అన్నారు. డోలీరహిత ఆవాసాలు ఉండాలనే సంకల్పంతో చేపట్టిన విషయాన్ని వారికీ చెప్పాలని తద్వారా వారి సహకారం, ప్రోత్సాహం కూడా లభిస్తుందని చెప్పారు.

## ఆపరేషన్ సిందూర్‌తో భారత్ బద్దలు కొట్టిన అరుదైన రికార్డ్ ఇదే..

**దీనికి ఎదుకింత ప్రాధాన్యం..**

సుదీర్ఘ గగనతల లక్ష్యాలను ఛేదించడం అంత సులువైన విషయం కాదు. చాలా అరుదుగా జరుగుతుంటాయి. ఇక 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలంటే.. అత్యంత కచ్చితత్వంతో పనిచేసే బియాండ్ విజువల్ రేంజి ఆయుధాలు అవసరం. రష్యా నుంచి భారత్ కొత్తగా కొనుగోలు చేసిన ఎస్-400 గగనతల వ్యవస్థలో ఇలాంటి ఆయుధాలున్నాయి. దీంతోపాటు వాడే నాలుగు రకాల క్షిపణుల్లో 40ఎన్6 రేంజి 400 కిలోమీటర్లు. దీనిని ఆపరేషన్ సిందూర్‌లో వాయుసేన పూర్తి స్థాయిలో వాడుకొంది. ఇంత దూరం నుంచి లక్ష్యాలను ఛేదించడంతోనే.. భారత్‌పై పాక్ యుద్ధ విమానాలు గైడెడ్ బాంబులను ప్రయోగించగలిగేంత సమీపానికి కూడా వచ్చేందుకు సాహసించలేదని భావిస్తున్నారు.

ఏమిటీ ఎస్-400?

ఇది సంచార క్షిపణి వ్యవస్థ. రష్యాకు చెందిన ఎన్‌పీవో అల్మాజ్ సంస్థ అభివృద్ధి చేసింది. గతంలో ఉన్న ఎస్-300ను ఆధునికీకరించి.. దీన్ని రూపొందించింది. ప్రస్తుతం మరింత మెరుగైన ఎస్-500 గగనతల రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది.

ప్రత్యర్థి జామింగ్ విధానాలను ఎస్-400 తట్టుకోగలదు. ఇది యుద్ధ విమానాలు, డ్రోన్లు, క్రూజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణులను అత్యంత కచ్చితత్వంతో నేలకూల్చగలదు. మొత్తం ఐదు క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు భారత్.. 2018లో రష్యాతో 543 కోట్ల డాలర్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో మూడు వ్యవస్థలు ఇప్పటికే భారత్ చేరాయి. మిగతావి వచ్చే ఏడాది ఆగస్టులో అందే అవకాశం ఉంది.

ఆపరేషన్ సిందూర్ వేళ పంజాబ్, రాజస్థాన్‌లలో ఒక్కొక్కటి చొప్పున ఎస్-400 వ్యవస్థలను మోహరించినట్లు తెలుస్తోంది. చైనా నుంచి రక్షణ కోసం అరుణాచల్ ప్రదేశ్ లేదా అస్సాంలో ఒక వ్యవస్థను రంగంలోకి దించి ఉంటారని అంచనా.

## వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది

"ఉపఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే పోలీసులు దౌర్జన్యాలు మొదలుపెట్టారు. గతంలో ఎలాంటి కేసులు లేని వారిపై కూడా బైండోవర్ కేసులు పెట్టి వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు" అని ఆరోపించారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న తమ పార్టీ నేతలే లక్ష్యంగా టీడీపీ గ్యాంగులు దాడులకు తెగబడుతున్నాయని జగన్ ఆరోపించారు. ఆగస్టు 6న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నేత వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం జరిగిందని, వారి కారును ధ్వంసం చేసి నిప్పంటించే ప్రయత్నం కూడా చేశారని తెలిపారు. ఈ దాడుల సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని విమర్శించారు. వైసీపీ తరఫున పనిచేస్తే ఇలాంటి దాడులే ఎదురవుతాయని భయపెట్టడానికే ఈ దారుణాలకు పాల్పడ్డారని అన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా, బాధితులైన వేల్పుల రాముతో పాటు మరో 50 మందిపై ఆగస్టు 6న మధ్యాహ్నం 3:30 గంటలకు తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ ఆరోపించారు. "ఆగస్టు 8న మా పార్టీ నేతను బెదిరించి, ప్రలోభపెట్టి ఫిర్యాదు తీసుకుని రాఘవరెడ్డి, గంగాధర్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి వంటి వారికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అదే రోజున పులివెందులలో వైసీపీకి ఓట్లు వేసే సుమారు 4,000 మంది ఓటర్లను ఇబ్బంది పెట్టేందుకు, పోలింగ్ బూత్‌లను గ్రామాలకు 2 నుంచి 4 కిలోమీటర్ల దూరానికి మార్చారు. బూత్ కబ్జా, రిగ్గింగ్‌కు ఆస్కారం కల్పించారు" అని ఆయన విమర్శించారు.పోలింగ్ రోజున మీడియా కవరేజీని నియంత్రించి, తమ దాడులు, దౌర్జన్యాలు బయటకు రాకుండా చూడాలని టీడీపీ ప్లాన్ చేస్తోందని జగన్ అన్నారు. "నిజం చెప్పాలంటే వీటిని ఎన్నికలు అనడానికే సిగ్గుగా ఉంది. అయినా నాకు దేవుడిపై, ప్రజలపై నమ్మకం ఉంది. అంతిమంగా ధర్మమే గెలుస్తుంది" అని జగన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఆనాడు సాయం.. నేడు ప్రయోగం.. అమెరికా శాటిలైట్‌తో ఇస్రో సరికొత్త చరిత్ర

రాకెట్ ప్రయోగంతోనే భారత అంతరిక్ష కార్యక్రమానికి బీజం పడింది. ఆ తర్వాత 1975లో కూడా అమెరికా శాటిలైట్ డేటా సహాయంతోనే ఇస్రో దేశంలోని 2,400 గ్రామాల్లో టెలివిజన్ల ద్వారా 'మాస్ కమ్యూనికేషన్' ప్రయోగాన్ని విజయవంతం చేసింది.

ఇటీవల జూలై 30న ఇస్రో, నాసా సంయుక్తంగా రూపొందించిన నైసర్ (నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వి-ఎఫ్16 రాకెట్ ద్వారా విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ మిషన్ కచ్చితత్వంపై నాసా శాస్త్రవేత్తలు సైతం ఇస్రో పనితీరును ప్రశంసించారు. "ఈ విజయంతో మనం అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిచాం" అని నారాయణన్ పేర్కొన్నారు.ఒకప్పుడు శాటిలైట్ టెక్నాలజీ లేని స్థాయి నుంచి, గడిచిన 50 ఏళ్లలో ఇస్రో అప్రతిహత ప్రగతిని సాధించింది. ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 433 ఉపగ్రహాలను తన సొంత రాకెట్ల ద్వారా విజయవంతంగా ప్రయోగించి, ప్రపంచ అంతరిక్ష వాణిజ్యంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

## ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక.. 'మేక్ ఇన్ ఇండియా': ప్రధాని మోదీ

రాష్ట్రం సమానంగా నిధులు సమకూర్చాల్సి ఉంది. అయినప్పటికీ.. రాష్ట్రం ఎక్కువ ఖర్చు చేస్తోంది" అని తెలిపారు. అభివృద్ధి విషయంలో మహారాష్ట్ర, గుజరాత్‌ల మాదిరే కర్ణాటకకూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బెంగళూరు పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అంతకుముందు బెంగళూరు-బెళగావి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచే వర్చువల్‌గా అమృత్‌సర్-కాట్రా, నాగ్‌పుర్-పుణె వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జెండా ఊపారు. బెంగళూరు-బెళగావి వందేభారత్ రైలులో ప్రయాణించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా.. నగరంలోని ఆర్‌వీరోడ్డు-

## హంద్రీ-నీవాలో కృష్ణమ్మ పరవళ్లు చూసి నా మనసు పులకరిస్తోంది

**హంద్రీ-నీవా ప్రాజెక్టులో నీటి ప్రవాహంపై సీఎం చంద్రబాబు హర్షం**

**రాయలసీమలోని 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమన్న సీఎం**

**రికార్డు సమయంలో కాల్వల విస్తరణ వల్లే ఇది సాధ్యమైందని వెల్లడి**

**చివరి భూములకు కూడా నీరందించాలనే కల నెరవేరుతోందని వ్యాఖ్య**

**రైతుల సంతోషం తమ సంకల్పానికి మరింత బలాన్నిస్తోందన్న చంద్రబాబు**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)

రాయలసీమకు జీవనాడి అయిన హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టులో కృష్ణా జలాల ప్రవాహంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందించారు. ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్లు చూసి తన మనసు పులకరించిపోయిందని తెలిపారు. ఈ సీజన్‌లో ప్రాజెక్టు కింద ఉన్న చివరి భూములకు సైతం నీరందించాలనే తమ కల సాకారమవుతోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని సుమారు 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, ప్రభుత్వం రికార్డు సమయంలో కాల్వల విస్తరణ పనులను చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ పనుల వల్లే ప్రస్తుతం హంద్రీ-నీవా కాల్వల్లో నీటి ప్రవాహం అత్యధిక సామర్థ్యంతో కొనసాగుతోందని పేర్కొన్నారు.

ప్రతి ప్రాజెక్టును, ప్రతి చెరువును నింపి, చివరి ఆయకట్టు భూములను కూడా తడపాలన్నదే తమ ఆశయమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం కాల్వల్లోని నీటి ప్రవాహాలు రైతుల ఆశలు, ఆకాంక్షలను నెరవేరుస్తున్నాయని తెలిపారు. రైతుల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషం, తమ ప్రభుత్వ సంకల్పానికి మరింత బలాన్ని చేకూరుస్తోందని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## మరో మార్గం లేదు – 'గాజా ఆక్రమణ'పై నెతన్యాహు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఆగస్టు 10)

ఇజ్రాయెల్ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయడం తప్పితే మరో మార్గం లేదని ఆ దేశ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. హమాస్‌ను అంతం చేసే ప్రక్రియను పూర్తిచేయడమే తమ లక్ష్యమన్నారు. జెరూసలెంలో విదేశీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. గాజాపై సైనిక చర్య ప్రణాళికను సమర్థించుకున్నారు. తదుపరి చర్యల కోసం చాలా తక్కువ సమయం ఉందన్నారు.

గాజాను ఆక్రమించడం తమ లక్ష్యం కాదని, దానికి స్వేచ్ఛ కల్పించడమే తమ లక్ష్యమని నెతన్యాహు మరోసారి స్పష్టం చేశారు. తమ చర్యలను ఖండిస్తూ స్థానికంగా, ఇజ్రాయెల్ బయట జరుగుతున్నది తప్పుడు ప్రచారమేనని అభిప్రాయపడ్డారు. గాజాను సైనిక రహితంగా మార్చడం, అక్కడి భద్రతను ఇజ్రాయెల్ సైన్యం తమ నియంత్రణలోకి తీసుకోవడం వంటివి తమ ఉద్దేశమన్నారు.

హమాస్ చర్యలే గాజా పౌరుల మరణాలు, నగరాల నాశనం, మానవతా సాయం అందకపోవడం వంటి సమస్యలకు కారణమని నెతన్యాహు మరోసారి ఆరోపించారు. ఇదిలాఉంటే, గాజా సిటీ స్వాధీనానికి ఇజ్రాయెల్ భద్రతా క్యాబినెట్ ఇటీవల ఆమోదం తెలపడంపై స్థానికంగా, అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి సహా చాలా దేశాలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించాయి. ఈ నేపథ్యంలోనే నెతన్యాహు స్పందిస్తూ.. మరో మార్గం లేదని చెప్పారు.

## కలసికట్టుగా పనిచేయండి

**ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలకు పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదేశం**

**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపైనా విచారణ**

**కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మల్లు రవి. చిత్రంలో కొండా మురళి, కమలాకర్‌రావు, శ్యాంమోహన్**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 10)

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నందున అంతా కలసికట్టుగా పనిచేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదేశించింది. మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళిపై ఆ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన ఫిర్యాదులపై కమిటీ ఆదివారం గాంధీభవన్‌లో సమావేశమై విచారణ జరిపింది. జిల్లా నేతలందరితో కలసి పనిచేస్తానని కొండా మురళి ఈ సందర్భంగా కమిటీకి లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. వరంగల్ నేతల మధ్య విభేదాలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అంశంపై సమావేశంలో చర్చించినట్లు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి మీడియాకు తెలిపారు. సీఎంపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శలు చేసిన అంశం కమిటీ దృష్టికి రాలేదన్నారు. కాంగ్రెస్ నేతలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, ఇతరులనే విమర్శించినట్లు అనిరుధ్‌రెడ్డి రాతపూర్వకంగా తెలిపినందున ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రవి పేర్కొన్నారు. ఇకముందు బహిరంగంగా వ్యాఖ్యలు చేసేముందు ఆచితూచి మాట్లాడాలని, పార్టీకి నష్టం కలిగేలా ఎవరూ మాట్లాడకూడదని హెచ్చరించినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కూడా లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చారన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయాలనేది పార్టీ నేతలందరి కోరిక అని, అందుకు కలసిమెలసి పనిచేస్తామని కొండా మురళి మీడియాకు తెలిపారు. తాను ఇచ్చిన వివరణకు క్రమశిక్షణ కమిటీ సభ్యులు సంతృప్తి చెందారని, పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం



## కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా మాజీ ఎమ్మెల్యే కదిరి జన్మదిన వేడుకలు

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 10)

కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు తన జన్మదిన వేడుకలను ఆయన నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు.కుటుంబ సభ్యుల మధ్య (తరువాయి 5లో...)

# అభిమానుల కోలాహలం నడుమ ఘనంగా

# మాజీ మంత్రి శిద్దా జన్మదిన వేడుకలు



వెల్లువలా ఉప్పొంగిన అభిమానం

శుభాకాంక్షలు తెలిపేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి భారీగా తరలి వచ్చిన అభిమానులు

పుట్టిన రోజు వేడుకలలో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించిన శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్ కుమార్

గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ గిరి, జిల్లా ఆర్యవైశ్య సంఘం, జ్యోతి గ్రానైట్స్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ వేడుకలు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

మాజీమంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు వేడుకలు, మనవడు విహాన్ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం చీమకుర్తిలోని శ్రీ హరిహర క్షేత్రంలో ఘనంగా జరిగాయి. గోల్డెన్ గ్రానైట్ ఏ గిరి ఆధ్వర్యంలో పుట్టినరోజు ఏర్పాట్లు మిన్నంటాయి. తమ అభిమాన నాయకుడి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. శిద్దా రాఘవరావు దంపతులకు, శిద్దా సుధీర్ కుమార్‌లకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభం, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ క్షేత్రంలో వేంచేసి ఉన్న సకల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోల్డెన్ గ్రానైట్ గిరి బాబు, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ ను శిద్దా రాఘవరావు దంపతులు కట్ చేసి అభిమానులు ఏర్పాటు చేసిన కలువ పూల గజమాల ను స్వీకరించారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు సందర్భంగా గోల్డెన్ గ్రానైట్ ఏ గిరి బాబు, కాట్రగడ్డ రవణయ్య ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలు అందరి మన్ననలు పొందాయి. చిమకుర్తికి బాష వృద్ధాశ్రమానికి దుప్పట్లు, ఎస్.కె.ఆర్ బధిరుల పాఠశాల విద్యార్థులకు కాస్మోటిక్స్, ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన పథకానికి కూకింగ్ గ్యాస్ ఏడాది ఖర్చు, మునిసిపల్ కార్మికులకు ఎప్రాన్, చేతి గ్లౌజ్‌లు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మొక్కలు, నోట్ బుక్స్ పంపిణి, అభిమానుల ఆధ్వర్యంలో దర్శిలో మునిసిపల్ కార్మికులకు అన్నదానం, గొడుగులు పంపిణి, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు ఉమా మనోవికాస కేంద్రంలో విద్యార్థులకు అన్నదానం, బొమ్మరిల్లులో చిన్నారులకు అన్నదానం నిర్వహించి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ తమ దాతృత్వం చాటుకున్నారు. జిల్లా అంతటా ఆర్యవైశ్య సంఘాలు పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. అభిమానుల ఆత్మీయ శుభాకాంక్షలు సందర్భంగా చీమకుర్తి హరిహర క్షేత్రం సందడిగా మారింది. చీమకుర్తి పట్టణానికి చెందిన ప్రముఖులు, ముఖ్యంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి ఆర్యవైశ్య సంఘం నాయకులు, గ్రానైట్ రంగాలకు చెందిన ప్రముఖులు, వాసవి మహిళలు, వాసవి యూత్ సభ్యులు, చీమకుర్తి పరిసర ప్రాంతాలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. తమ నాయకుడు శిద్దా రాఘవరావు శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు తీరారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు పల్లపోతు వెంకటేశ్వర్లు, రావూరి కాశీ రంగ జనార్ధన్‌రావు, జలదంకి కృష్ణారావు, బొగ్గవరపు సుబ్బారావు, కొత్తురి శ్రీ రంగ నాయకులు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి చినిగేపల్లి సురేష్, గునుపూడి భాస్కర్, చలువాది బదరీ నారాయణ, కోట హనుమంతరావు, మండల ఆర్యవైశ్య నాయకులు, వాసవి మహిళలు, చీమకుర్తి ఆర్యవైశ్య మహిళలు, ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో తమ నాయకుడు శిద్దా రాఘవరావు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రకాశం జిల్లా గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు అజీమ్, మండవ శ్రీను, మండవ గోపి, మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవ, బొమ్మిశెట్టి కిరణ్, గ్రంధి శ్రీహరి, నూకల సురేంద్ర, నూకల సుబ్రమణ్యం, చలగండ్ల హనుమంతరావు, యడవల్లి రామ బ్రహ్మం, మన్నం ప్రసాద్, మారం వెంకారెడ్డి, అంకరావు, డాక్టర్ జవహర్‌తో పాటు చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు శిద్దా రాఘవరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ముండ్లమూరు, తాళ్లూరు, దొనకొండ, కురిచేడు, దర్శి, పొదిలి ప్రాంతాలకు చెందిన శిద్దా అభిమానులు తమ నాయకుడి పుట్టినరోజు వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. (తరువాయి 4లో...)

# రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతోంది

విత్తనం నుంచి విక్రయం వరకు రైతులకు అండగా ఉంటున్నాం

ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు డబ్బులిస్తున్నాం

జగన్ పబ్లిసిటీ పిచ్చితో పట్టాదారు పాసుపుస్తకాల పైనా తన బొమ్మ వేసుకున్నారు

నేడు రాజముద్రతో రైతులకు కొత్త పాస్ పుస్తకాలు

గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో జగన్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారు

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

కామేపల్లిలో అన్నదాత సుఖీభవ కృతజ్ఞత భారీ ట్రాక్టర్ ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 10)

రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం జరుగుమల్లి మండలం కామేపల్లిలో అన్నదాత సుఖీభవ కృతజ్ఞత భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి డాక్టర్ స్వామి, ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ జగన్ పబ్లిసిటీ పిచ్చితో పట్టాదారు పాసుపుస్తకాల పైనా తన బొమ్మ వేసుకున్నారన్నారు. నేడు రాజముద్రతో రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో జగన్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతోంది. విత్తనం నుంచి విక్రయం వరకు ప్రతి దశలోనూ రైతులకు అండగా ఉంటున్నాం. ధాన్యం కొనుగోలు (తరువాయి 5లో...)

# నూతన ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 10)

పొదిలి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బుజ్జి ఫ్లెక్సీ ప్రింటింగ్ దుకాణాన్ని ఆదివారం పొదిలి సీఐ టి వెంకటేశ్వర్లు రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. పెద్ద బస్టాండ్ పాత నిమ్మయ్య హోటల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి వెంకట నారాయణబాబు, పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, పొదిలి మండల, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, ముల్లా ఖుద్దూస్, రాష్ట్ర టిఎన్‌ఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్, మాజీ సర్పంచ్ కాటూరి నారాయణ ప్రతాప్, మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, (తరువాయి 5లో...)



# అభిమానుల కోలాహలం నడుమ ఘనంగా మాజీ మంత్రి శిద్దా జన్మదిన వేడుకలు







**ఒంగోలు లో అట్టహాసంగా**
**మాజీమంత్రి శిద్దా రాఘవ రావు జన్మదిన వేడుకలు**

మాజీమంత్రి శిద్దా రాఘవ రావు జన్మదిన వేడుకలు సందర్భంగా ఒంగోలులో వారి నివాసంలో వైభవంగా నిర్వహించారు.జ్యోతి గ్రానైట్ సి.ఓ.ఓ ఎం శివరాం ఆధ్వర్యంలో భారీ కేక్, బల్లికురవ లక్ష్మి గ్రానైట్ మేనేజర్ ఉప్పుటూరి కృష్ణారావు ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కేకు మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ దంపతులు కట్ చేశారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు జన్మదిన వేడుకలు సందర్భంగా ఒంగోలుకు చెందిన ప్రముఖులు శిద్దా బాలాజీ, శిద్దా సురేష్, శిద్దా భరత్, టి అరుణ, గుమ్మడి సాయి బాబు, జ్యోతి గ్రానైట్ సి.ఓ.ఓ ఎం శివరామ్, గుప్తాస్ వీర బాబు, ప్రణీత్, రంగ మన్నార్, గ్రంధి కార్తీక్, అద్దంకి మురళీకృష్ణ, చలువాది హనుమంతరావు, రావిపూడి లక్ష్మి నారాయణ, ఇస్కాన్ ప్రతినిధులు, గ్రానైట్ సంస్థలకు చెందిన ప్రముఖులు, న్యాయవాదులు, వైద్యులు శిద్దా రాఘవరావు కు శు భాకాంక్షలు తెలిపారు. ఒంగోలు వల్లూరమ్మ దేవస్థానం, టీటీడీ, శ్రీ ఆంజనేయు స్వామి ఆలయ అర్చకులు శిద్దా రాఘవరావు దంపతులకు వేద ఆశీస్సులు అందించి స్వామి వారి, అమ్మవారి శేష వస్త్రాలు అందచేశారు.















# రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పాటుపడుతోంది












చేసిన 24 గంటల్లో రైతులకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నాం.రైతులకు సబ్సిడీకి యంత్రాలు, యంత్ర పరికరాలు ఇస్తున్నాం. గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో జగన్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారు. కనీసం రైతులకు సరైన గోనె సంచులు ఇవ్వలేక చిల్లులు పడ్డ గోనె సంచులు ఇచ్చారు. గత 5 ఏళ్లలో వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీనికి కారణం జగన్. రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని మంత్రి స్వామి అన్నారు.

# నూతన ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రారంభం









మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైసిపి నగర పంచాయతీ అధ్యక్షులు సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి, కల్లం వెంకట సుబ్బారెడ్డి, జి శ్రీను, ముప్వల పార్ధసారథి, జనసేన కనిగిరి ఇన్‌ఛార్జి వరికూటి నాగరాజు, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా, వైసీపీ నాయకులు యక్కలి శేషగిరిరావు, పలువు ప్రముఖులు పాల్గొని నిర్వహకులకు శుభాకాంక్షలు తెలిపి దినదినాభివృద్ధి చెందాలని దీవెనలు అందించారు.



# కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా మాజీ ఎమ్మెల్యే కదిరి జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కదిరి బాబురావుకి కుటుంబ సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పేద మహిళలకు నిత్యావసర సరుకులు, ఆర్ధిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి ప్రకాశ్ రావు దంపతులు, కదిరి పార్థసారథి దంపతులు, కదిరి బాలకృష్ణ దంపతులు, బొత్స సందీప్ దంపతులు, కదిరి పిచ్చయ్య, కదిరి కృష్ణ,కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జగన్మాత ఈశ్వరి దేవి అమ్మవారి మందిర పునః నిర్మాణంకు రూ.25,116 విరాళం





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 10)**

వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో ఉన్న శ్రీ జగన్మాత ఈశ్వరి దేవి అమ్మవారి మందిరం పునః నిర్మాణం కోసం ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధికార ప్రతినిధి, శివాలయం మాజీ మెంబర్ పులుకూరి నాగేశ్వరరావు రూ.25,116లను దేవస్థానం కోసం విరాళంగా ప్రకటించారు. ఈ నగదును ఆదివారం రాత్రి పులుకూరి నాగేశ్వరరావు, శివకుమారి దంపతులు మఠాధిపతికి అందజేశారు. నాగేశ్వరరావు కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ నాగేశ్వరరావు ఇంకా మరెన్నో కార్యక్రమాలు చేసి అందరి మన్ననలు పొందాలని ప్రకాశం జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం తరఫున అభినందనలు తెలుపుతున్నామని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు.

# వివాహ వేడుకల్లో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 10)**

అనిల్ గార్డెన్స్ నందు బాలాజీ జ్యూవెలర్స్ అధినేత గుత్తి రాజ కుమార్తె శ్రీదివ్య వివాహ వేడుకల్లో జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు, పామూరు పట్టణ రెండో ప్రాదేశిక ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నీరుకట్టు రసూల్, గద్దె సుధాకర్ , బొగ్గవరపు సాయి బ్రహ్మం, సంకతాల హజరత్, ఆవుల నారాయణ, పుప్పాల రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# మహాసభలకు జెండాలు, ప్రచార మెటీరియల్ సిద్ధం చేస్తున్న కార్యకర్తలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 10)

ఆగస్టు 12, 13 తేదీలలో కనిగిరిలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 17వ మహాసభల జయప్రదానికి కార్యకర్తలు ప్రచారానికి సంబంధించిన జెండాలు, మెటీరియల్ సిద్ధం చేస్తున్నారని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణమంతా తోరణాలు, మహాసభకు సంబంధించిన బ్యానర్లతో విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. కనిగిరి నియోజకవర్గం తో పాటు జిల్లా వ్యాప్తంగా జనసమీకరణకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. 12వ తేదీ ఉదయం 11 గంటలకు టీచర్స్ అకాడమీలో ప్రారంభ సభ జరుగుతుందని, మధ్యాహ్నం మూడు గంటలకు ప్రదర్శన బయలుదేరి 4 గంటల నుండి క్లబ్ రోడ్ సెంటర్లో బహిరంగ సభ జరుగుతుందని ఆహ్వాన సంఘం తరపున సిఐటియు కార్యదర్శి పిసికేశవరావు తెలియజేశారు. ఈ మహాసభల విజయవంతానికి ఈ ప్రాంత ప్రజానీకం అన్ని విధాల మద్దతు తెలిపారని, వారు ఇచ్చిన స్ఫూర్తితో మహాసభ విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి. నరేంద్ర, జి శ్రీనివాసరెడ్డి, కే రత్తమ్మ, ఎం ఎలేశమ్మ, ఎస్కే షమీల, కే వెంకటమ్మ, ఎస్ కే లాల్ బి, ఎస్ కే వలి, యు. పిచ్చయ్య, పి హజరత్, తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ కమిటీ సభ్యుని కుటుంబానికి ఆర్థిక చేయూత




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 10)

కనిగిరి మోడల్ స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న వికిల్ వారి తండ్రి ఉయ్యూరు నాగేంద్రబాబు(రాము) మన మోడల్ స్కూల్ నందు కమిటీ సభ్యులు ఈనెల ఆరో తేదీ కిడ్నీ సమస్యతో గుంటూరు జి జి హెచ్ లో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడవడంతో అంతక్రియలు పూర్తి అవడంతో ఆలస్యంగా కమిటీ సభ్యులకు తెలియడంతో ఆదివారం ఉదయం 8:30 గంటలకు వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి చిన్న పాటి ఆర్థిక సహాయం రూ.5000లు కమిటీ సభ్యులు ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఎస్ఎంసి ఛైర్మన్ పందిటి మోహన్, బోస్, సత్యం, జెర్మియా, సురేష్, బొడ్డు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# షరాబు దీపు దంపతులకు ఆశీర్వచనాలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 10)

పొదిలి పట్టణ టీడీపీ నాయకులు, రేషన్ డీలర్, హెూండా షోరూం అధినేత షరాబు సత్యనారాయణ, వెంకట సరళాదేవి దంపతుల ఏకైక కుమారుడు వెంకట సాయి కృష్ణ దీపు, కృష్ణ నవ్యశ్రీల వివాహ వేడుక అంగరంగ వైభవంగా పట్టణంలోని శ్రీ మంజునాథ ఏసి ఫంక్షన్ హాలు నందు ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకకు పట్టణంలోని ప్రముఖులు, బంధుమిత్రులు, రాజకీయ నాయకులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు), తానికొండ వెంకట్రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మాజీ జడ్పీటిసి సభ్యులు కాటూరి వెంకట నారాయణ బాబు, మాదాలవారిపాలెం పిఏసిఎస్ ఛైర్మన్ యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, తలమల్ల వెంకట్రావు, సోమయ్య, కొనకనమిట్ల మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రేషన్ డీలర్ గౌస్, షరాబు భాను, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, హాజరై నూతన దంపతులకు ఆశీర్వచనాలు అందించారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం

## బొడ్డు కుటుంబరావు ఆధ్వర్యంలో ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో నిర్వహణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

దేనువకొండ, స్థానిక జెడ్పీ హై స్కూల్ ఆవరణలో బొడ్డు శేషయ్య తిరుపతమ్మ, గోకతోటి అక్కయ్య, ఆదెమ్మ జ్ఞాపకార్థం బొడ్డు కుటుంబరావు ఆధ్వర్యంలో, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుండి నిర్వహించిన వైద్యశిబిరంలో సుమారు 350 మందికి, షుగర్, బి.పి , గుండె సంబంధిత వైద్య పరీక్షలు ఈ.సి.జి , ఛాతి సంభంధ వైద్య పరీక్షలు పి.ఎఫ్.టి లు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం నందు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ప్రకాష్ చవల ఎముకలు, కీళ్లు , జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్, డాక్టర్ జయవర్ధన్ హార్మోన్ సంభందిత వైద్య నిపుణులు, డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్ డయాబెటాలజిస్ట్ మరియు సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు పాల్గొన్నారు వైద్య శిబిరంలో పాల్గొన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారికీ పదిహేను రోజుల పాటు ఉచిత ఒపి, నిర్ణీత వైద్య పరీక్షలపై 50% రాయితీ ఇస్తున్నట్లు ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అల్ కుమార్ డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలిపారు. గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన ముందస్తు ఆరోగ్య సమస్యలు గుర్తించి సరియైన వైద్యం చేయించుకోవడానికి ఉపయోగకరం అవుతుంది అని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్ చివుకుల, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ తెలియజేశారు. మెగా వైద్య శిబిరంలో బొడ్డు కుటుంబరావు, గోకతోటి గోపీ కృష్ణ , గ్రామ పెద్దలు మరియు ఉపాస్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ బి. ఆనంద్ కుమార్, ఆర్థోఫిజియో అసిస్టెంట్ డాక్టర్ జగదీష్, పి. ఆర్.ఓ లు ఇస్లాం, మల్లిఖార్జున, రాము, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి పీచు పరిశ్రమ అభివృద్ధి పై మాగుంట ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి పీసు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు, ఉద్యోగ కల్పన, అభివృద్ధి చర్యలు, ఆర్థిక,సాంకేతిక సహాయాలు, ప్రారంభ సంస్థల వృద్ధి కార్యక్రమాల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి, జితిన్ రాం మంజ్హి సమాదానమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సహాయం పొందిన 743 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కొబ్బరి పీసు సంస్థలు వున్నాయని, అందులో 5,944 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. కొబ్బరి పీసు పరిశ్రమ అభివృద్ధికి ప్రధాన కార్యక్రమాలను పి.యం. ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, కాయర్ వికాస్ యోజన , ఫండ్ ఫర్ రీజనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్ పథకాలను అమలు జరుగుచున్నవని తెలిపారు. కొత్త సంస్థలు ప్రాజెక్టుల ఏర్పాటుకు పి.యం. ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, ఫండ్ ఫర్ రీజనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్ పథకాల క్రింద 35 శాతం సబ్సిడీతో బ్యాంకు అప్పులు, సాంకేతిక సహాయాలు అందజేయబడునని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పియం ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం క్రింద 2020-21 లో రూ.363.65 లక్షలు, 2021-22 లో రూ.429.21 లక్షలు, 2022-23 లో రూ.451.79 లక్షలు, 2023-24 లో రూ.292.34 లక్షలు మరియు 2024-25 లో రూ.218.20 లక్షలు సబ్సిడీ ఇవ్వబడగా, ప్రకాశం జిల్లాలో 2021-22 లో రూ.5.25 లక్షలు, 2022-23 లో రూ.2.58 లక్షలు మరియు 2023-24 లో రూ.3.50 లక్షలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రీజనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్ క్రింద 5 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి జిల్లాకు రూ. 395.50 లక్షలు ఇవ్వబడినదని తెలిపారు. కాయర్ బోర్డు వారు తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో ఒక జీవనోపాది వ్యాపార సంస్థను ఏర్పాటుచేసి, కొత్త కొబ్బరి పీచు ప్రాజెక్టుల ఏర్పాటుకు లబ్దిదారులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నదని కేంద్ర మంత్రి తెలిపారు.

# భారత ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఈసీఐ డాక్టర్ మాచర్ల మోహన్‌రావు

## చీరాలలో ఆందోళన, నిరసనలకు ప్రజా సంఘాల పిలుపు

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఆగస్టు 10)

ప్రస్తుత రాజకీయ పరిస్థితులను గమనిస్తే మన దేశం హిందూ మతోన్మాద నియంతృత్వ రాజకీయాల కబంధహస్తాలలో పూర్తిగా మునిగిపోయిందని, మత విశ్వాసాలను అడ్డుపెట్టి వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ఇదే ప్రజాస్వామ్యమనీ దేశాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్న నరేంద్ర మోడీ పరిపాలన దేశానికి అత్యంత ప్రమాదకరంగా తయారయిందని జాతీయ చేనేత నాయకులు డాక్టర్ మాచర్ల మోహన్ రావు పేర్కొన్నారు. చీరాల పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాలు నందు ఆదివారం సాయంత్రం నిర్వహించిన భారత ఎన్నికల వ్యవస్థ డొల్లతనం అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భావించే ప్రజల విశ్వాసాలను నమ్మకాన్ని వమ్ము చేస్తూ భారత ప్రజాస్వామ్యంపై ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా చేసిన దాడిగా భావించాల్సి ఉంటుందన్నారు. 2024 ఎన్నికలకు సంబంధించి పలువురు ప్రజాప్రతినిధులు న్యాయస్థానాలను ఆశ్రయించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు, కోర్టు ఇచ్చిన తీర్పులను సైతం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా బుట్ట దాఖలు చేసే పరిస్థితుల వెనక మనువాద హిందూ ఉన్మాద కుట్ర దాగి ఉన్నదని, ఇది భారత ప్రజా స్వామ్యక వ్యవస్థను ప్రమాదం లోకి నెట్టు వేస్తున్న ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలైన మనందరిపై ఉందని మోహన్ రావు అభిప్రాయపడ్డారు. గోసాల ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ చుండూరి వాసు, దామర్ల శ్రీకృష్ణ, సిపిఐయం ఎన్.బాబూరావు, రాష్ట్ర చేనేత జన సమాఖ్య ప్రతినిధి గుంటూరు మల్లికార్జున్, సీనియర్ జర్నలిస్ట్ నాగార్జున రెడ్డి, సీనియర్ సిటిజన్స్ సింహాద్రి ఎల్లమందరెడ్డి, గాదే హరి హరరావు , వెన్నెల కంటి శర్మ, దళిత మహాసభ నేత నూకతోటి బాబురావు, ఎరుకుల హక్కుల పోరాట సమితి ఎన్ మోహన్ కుమార్ ధర్మ, ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి గొర్రెపాటి రవి కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



# ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో యూఏవి యాంటెన్నా డిజైన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్స్ పై సదస్సు





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 10)**

కందుకూరు ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ (స్వయంప్రతిపత్తి) లోని ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో "యూ.ఏ.వి. (మనరహిత వైమానిక వాహనం) యాంటెన్నా డిజైన్ అండ్ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్" పై ప్రత్యేక సదస్సు ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహించారు. ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, గంగూరుకి చెందిన అకడెమిషియన్ మరియు పరిశోధకులు డాక్టర్ సురేంద్ర లోయ ప్రధాన అతిథిగా పాల్గొని యూ.ఏ.వి. యాంటెన్నాల రూపకల్పన, వైర్‌లెస్ కమ్యూనికేషన్ సాంకేతికతలపై సవివరంగా వివరించారు. ఈ ఉపన్యాసం విద్యార్థుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది. ప్రసంగం పట్ల ప్రకాశం విద్యార్థులు చూపిన అంకితభావం, శ్రద్ధపై డాక్టర్ సురేంద్ర ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా కాలేజ్ కరస్పాండెంట్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) మరియు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) విభాగాలు రాబోయే ఒకటి లేదా రెండు సంవత్సరాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగాన్ని మించిపోతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇందుకు కారణాలుగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వేగంగా పెరుగుతున్న పరిశ్రమ అవసరాలు, రాబోయే గ్రీన్ ఎనర్జీ విప్లవం, ఎంబెడ్డెడ్ సిస్టమ్స్, ఐఓటీ, డ్రోన్ల వంటి ఆవిష్కరణలకు ఉన్న విస్తృత అవకాశాలను పేర్కొన్నారు. అలాగే, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉన్నత స్థాయి లెక్చర్ అందించినందుకు డాక్టర్ సురేంద్రకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సురేంద్రను సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కుమార్ మాట్లాడుతూ తమ కాలేజీ విద్యార్థుల అభ్యాసం కోసం నిరంతరం ఆధునిక సాంకేతిక వనరులు, ల్యాబొరేటరీలు, మరియు ఉన్నత ప్రమాణాల విద్యా పద్ధతులను ప్రవేశపెడుతున్నామని గర్వంగా తెలిపారు. ఇది విద్యార్థులు గ్లోబల్ స్టాండర్డ్స్‌లో పోటీ పడే సామర్థ్యాన్ని పెంచుతోందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ గద్దె సురేష్ మాట్లాడుతూ తమ కాలేజీ పరిశ్రమలతో కుదుర్చుకున్న అనుబంధాలు, ఇండస్ట్రీ-ఓరియెంటెడ్ ప్రాజెక్టులు, ప్రాక్టికల్ లెర్నింగ్ విధానాలు విద్యార్థులను తక్షణమే ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేస్తున్నాయని చెప్పారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు ఈ కార్యక్రమం పై, కాలేజీ అందిస్తున్న అవకాశాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగ ప్రొఫెసర్లు డాక్టర్ హనుమంతరావు, రామ కోటేశ్వరరావు, శ్రీకాంత్, మాధవ రావు, మస్తాన్‌వలి, శ్రీహరి, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు జన్మదిన వేడుకలు






**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 10)**

సిఎస్‌పురం కదిరి బాబురావు వ్యవసాయ ,ఉద్యాన కళాశాలల ఆవరణలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖ పార్లమెంట్ వైసీపి పరిశీలకులు కదిరి బాబురావు విద్యాసంస్థల వ్యవస్థాపకులు కదిరి బాబురావు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసిలు మునగల నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డిలు కేక్ కట్ చేసి కదిరి బాబురావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల ఉద్యాన కళాశాలలు మారుమూల ప్రాంతంలో స్థాపించి అన్నివిధాల అభివృద్ధి చేసి విద్యాపరంగా వసతుల పరంగా ఆధునిక టెక్నాలజీ పరికరాలు అందుబాటులో ఉంచారని అన్నారు. కనిగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసారని కొనియాడారు. భగవంతుని దయతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్నం తిరుపతయ్య, టి బాబురావు, నున్నా నారాయణ, షేక్ నాయబ్ రసూల్, పాశం సురేష్, కదిరి రఘు, షేక్ అహమ్మద్, సుంకరి అంజనాద్రి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మెడబలిమి వారి వివాహ వేడుకలో ఎంపిటిసి సభ్యులు ఆకుపాటి



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 10)**

మెడబలిమి ముసలయ్య కుమార్తె వివాహ కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు, పామూరు పట్టణ రెండో ప్రాదేశిక ఎంపిటిసి సభ్యులు ఆకుపాటి వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై నూతన దంపతులకు ఆశీర్వచనాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీరుకట్టు రసూల్, వార్డ్ మెంబెర్ ఆవుల నారాయణ, పుప్పాల రామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి డోల



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, ఆగస్టు 10)**

కొండపి మండలం నేతివారిపాలెంలో నేతి వారి వివాహానికి హాజరై నూతన వధూవరులు ముకేష్, శ్రావణి లను మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కొండపి మండల నాయకులు పాల్గొన్నారు.



# హరిబాబు, రహముల్లాకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపిటిసి ఆకుపాట



**(షణ్ముఖ వెలుగు, పామూరు, ఆగస్టు 10)**

పామూరు మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్, డైరెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఉప్పలపాటి హరిబాబు, యలమందల రహముల్లాకి జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు, పామూరు రెండో ప్రాదేశిక ఎంపీటీసీ సభ్యులు ఆకుపాటి వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు నీరుకట్టు రసూల్, ఆవుల నారాయణ, పుప్పాల రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరి పనితీరు అద్భుతం

## నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తున్న ఎమ్మెల్యే అంటున్న ప్రజలు





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 10)**

కందుకూరు పట్టణ 6వ వార్డులో టిడిపి నాయకులు ఆదివారం ఇంటింటికి తిరుగుతూ "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ సూపర్-6 ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించారు. సమస్యలు అడిగి ఫోన్లో నమోదు చేశారు. ఈ సందర్భంగా 6వ వార్డులోని ప్రజలు ఎమ్మెల్యే పనితీరు బాగుందని నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి చేస్తున్నారన్నారు. అను నిత్యం ప్రజల మధ్యనే వుంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పనిచేస్తున్న తీరు అద్భుతం అని ప్రజలు స్పందించారు. అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేసిన ప్రతి సంక్షేమ పథకాలు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు టిడిపి అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షులు షేక్ మున్న, కందుకూరు పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అహ్మద్ బాషా నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, 6వ వార్డు టిడిపి ఆర్గనైజేషన్ సెక్రటరీ పఠాన్ షౌకత్, ముస్లిం మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఫాజిల్, తదితరులు పాల్గొన్నారు.





## చూసిన వారికి చూడ ముచ్చటగా....

# ముగిసిన శ్రీగిరి పవిత్రోత్సవాలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు ఆదివారం రాత్రి పూర్ణాహుతితో ఘనంగా ముగిసాయి. మూడు రోజుల పాటు శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి నిర్వహించిన వివిధ కార్యక్రమాలను ప్రత్యక్షంగా తిలకించిన భక్తుల మనస్సులు పవిత్ర భక్తి భావంతో నిండిపోయి ఆనంద తరంగితమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానం విశ్రాంత వేద పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో హెూమ కార్యక్రమాలతో పాటు శ్రీవారికి విశేష స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని శోభాయమానంగా నేత్ర పర్వంగా వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంతో శ్రీగిరి శ్రీవారి పవిత్రోత్సవాలు ఘనంగా ముగిసాయి. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి.. ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మి కుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ఆలూరు జై శంకర్, ఆలూరు కుమార్ ఆత్రేయ, ఆలూరు ఫణి కుమార్ తదితరులు పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులకు శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.







# ఒంగోలు పట్టణ టైలర్స్ సమావేశం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

ఒంగోలు పట్టణ టైలర్స్ సమావేశం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎస్.కె హుస్సేన్ టెక్స్ టైలర్ అధ్యక్షతన ఒంగోలులోని కాసిం బిల్డింగ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఒంగోలు టౌన్ టైలర్స్ నూతన అధ్యక్షుడిగా ఎస్.కె కాసిం , ఉపాధ్యక్షుడిగా బి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ కే హల్తాఫ్, సహాయ కార్యదర్శిగా సిహెచ్ సురేష్, కోశాధికారిగా ఎన్ బాల చైతన్య వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర టైలర్స్ నాయకులు జిల్లా నాయకులు ఒంగోలు టౌన్ టైలర్స్ కార్యవర్గ సభ్యులు ఎస్ సందీప్, ఎస్ కే జానీ, ఎస్ కే రహిమాన్, మాజీ అధ్యక్షులు ఎస్ కే సుభాని, తదితరులు పాల్గొన్నారు.

# క్విట్ కార్పొరేట్ నినాదంతో ట్రాక్టర్, మోటార్ సైకిల్స్ ప్రదర్శన

### వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే మోదీ విధానాలకు నిరసన

### ఆగస్టు 13వ తేదీ క్విట్ కార్పొరేట్ నినాదంతో

### ఒంగోలులో సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వ కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 10)

బ్రిటిష్ సామ్రాజ్యవాధాన్ని భారతదేశ నుండి తరిమి కొట్టడానికి ఆనాడు (83 సంవత్సరాల క్రితం) జాతీయ కాంగ్రెస్ క్విట్ ఇండియా పిలుపునిచ్చింది. ఆ స్ఫూర్తితో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ లకు కట్టపెట్టే మోడీ విధానాలను దృష్టిలో ఉంచుకొని క్విట్ కార్పొరేట్ నినాదంతో సంయుక్త కిసాన్ మోర్చా , ట్రేడ్ యూనియన్లు కలిపి పిలుపునిచ్చాయని , దాని ప్రకాశం జిల్లాలో శక్తివంతంగా అమలు చేస్తామని ఎస్కేఎం ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం గురించి ఆదివారం ఎల్బీజీ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి జయంతి బాబు అధ్యక్షత వహించారు. సమావేశం చర్చించి క్రింది నిర్ణయాలు చేయడం జరిగింది. క్విట్ ఇండియా నినాదంతో ఆగస్టు 13వ తేదీ ఒంగోలు మినీ స్టేడియం నుండి అద్దంకి బస్టాండ్ వరకు ట్రాక్టర్లు, మోటార్ సైకిల్స్ ప్రదర్శన నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో చిట్టి పాటి వెంకటేశ్వర్లు, (అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)కోడూరు హనుమంతరావు(ఎ ఐకెఎంఎస్) రైతు కూలీ సంఘం ఆంధ్ర ప్రదేశ్ జిల్లా కార్యదర్శి కె లలిత కుమారి, కాంగ్రెస్ రైతు విభాగం నుండి కొండ్రుగుంట సుబ్బారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి వి కొండారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, ఇరిగినేని వెంకట నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com